స్కెచ్

# గెలుపులో ఓటమి

"జ్యేష్ఠ"

కాలేజీనుంచి వచ్చి బట్టలు మార్చుకొంటున్నాను. 'ధన్' మని పెరట్లో ఏదో శబ్దం, దానివెంటనే 'భళ్లు' మని పగిలిన ధ్వని. అత్తయ్య చెంబు పెరట్లో నేలమీదికి విసిరి, గాజు గ్లాసు గోడకి కొట్టి అటు చూస్తోంది. ఏముం దక్కడ? పక్కయింట్లో అమ్మమ్మ మాట్లాడుతోంది ఆ యింటి బామ్మగారితో. అత్తయ్య నన్ను చూసి అంది "చూశావాబాబీ!ఎంత ఆదరంతో మాట్లాడుతోందో? ఆ మాటలు నాతో మాట్లాడకూడదూ" ఆమె గొంతుకలో ఏడుపు వినిపిస్తోంది.

ఆడవాళ్ళలో ఎక్కువమందికి కబుర్లంటే మహా యిష్టం. అది మీకూ తెలుసు. తనతో మాట్లాడే వాళ్లు లేరని మా అత్తయ్య బాధ అని మీ రనుకోవచ్చును. కాని అత్తయ్య అట్టే వాగదు. ఎవరేనా పది నిముషాలు ఏకబిగిని తనతో మాట్లాడితే 'ఏమిటీ వాగుడు' అని విసుక్కుంటుంది. అట్టి అత్తయ్య తన అత్తగారితో ఊరికే మాట్లాడెయ్యలేదని వగచడం విచిత్రంగా కనపడవచ్చు. కాని నాకేమి విచిత్రంలేదు. ఆమె పద్ధతే అంత. ఆమెకు వాగడం అంటే ఒళ్లుమంట అని గ్రహించిన అనుభవశాలి అమ్మమ్మ పక్కింటికి వెళ్ళింది. అది అనడం ఇష్టంలేక అత్తయ్యతో "పోనిద్దూ! మనకెందుకా ముసలి కబుర్లు" అన్నాను. (అత్తయ్య నాకన్న మూడేళ్ళు పెద్దది. 'మనకి' అని అన్నది అందుచేతనే.) దానికి ఆమె చేతులు తిప్పుతూ అంది "అవేం ముసలమ్మ కబుర్లు కావు. మనం ఈ ఇంట్లో ఉండడం మంచిదా లేక మరో చిన్న ఇంటికి మారడం మంచిదా అని. ఈ విషయం గురించి మాట్లాడటానికి ఇంటికోడల్ని నేను తగను కాబోలు!" నిజానికి ఈలాంటి గొడవలంటే అత్తయ్యకు ఇష్టమూ లేదు;వాటిపరిజ్ఞానమూ లేదు. పైగా పక్కింటి బామ్మకు ఖాళీఇళ్ళ సంగతి బాగా తెలుసు. ఆమెతో మాట్లాడ్డంలో అమ్మమ్మ తప్పులేదు. ఆమాట నేనంటే అత్తయ్య ఇంకా బాధపడుతుంది. ఏం చెప్పాలో ఆలోచిస్తున్నాను. ఇంతలో స్నేహితుడొకడు రావడమూ నేను సుఖంగా నిష్క్రమించడం జరిగాయి.

మరొక రోజున మధ్యాహ్నం మూడుగంటలకి అమ్మమ్మ అత్తయ్యతో అంది. "శశీ! నువ్వీపువ్వులు తీసుకొని సరోజ ఇంటికి వెళ్ళు. సాయంత్రంవరకు కబుర్లు చెప్పుకురావచ్చు." అమ్మమ్మ వెళ్ళినతర్వాత అత్తయ్య నా వేపుచూసింది. "ఈవిడ అధికారం చెలాయిస్తోంది చూశావా" అన్నట్లుగా ఇంతకు ముందు ఆ పువ్వులు అమ్మమ్మే ఇచ్చివచ్చేది. సరోజ మా క్లాసే చదువుతోంది కాలేజీలో. సదరు సరోజ నాకు ఒదినగా మా కుటుంబాలో అడుగెట్టబోతోంది. అత్తయ్యకి ఈ కాబోయే బంధువులతో స్నేహం కలవటం మంచిదని అమ్మమ్మ ఊహ.

అత్తయ్య సరోజా ఒకటో క్లాసు ఒక బళ్లోనే చదివారుట. అత్తయ్యకు సరోజను చూడాలనే ఉంది. కాని చూడమని అమ్మమ్మ అనడం కొంప ముంచింది. మనం ఓ వెధవపని చేసి అది వెధపని అని చేశాక తెలుస్తే మనని మనమే "వెధవ" అని తిట్టుకుంటాం. మనం వెధవన్నర పనులు చేసి, ఆ పన్లుచేయడం మన వెధవ తెలివికి నిదర్శనం అనే సంపూర్ణ విశ్వాసంతో ఉన్న సమయంలో మనని ఎవరేనా వెధవ అని పరిహాసానికేనా అంటే మనస్సు చివుక్కుమంటుంది. అత్తయ్యని అమ్మమ్మ ఆజ్ఞాపించిందని అత్తయ్య అలాగే బాధపడింది. "అత్తగారి అధికారం..."లాంటి ఐతిహాసిక ప్రాముఖ్యంగల పదాల్ని గుండె తరుక్కుపోయేలా ఆలోచించి కన్నీళ్ళను పిండేందుకు ప్రయత్నిస్తోంది. అత్తయ్య చాలాసేపు అద్దంముందు నుంచుని కోపంతో తనఅందమైనముఖం ఎంతవికృతమైందో పరీక్షిస్తోంది కాబోలు! తనకు ఎంతో అసహ్యాకరమైన పట్టుచీర కట్టుకుంది (ఆమెకు అసహ్యం కాని

ఆ చీర బాగానే వుంటుంది.) వికృతాలంకరణకు పీలైనంత టైము వ్యర్థంచేసి విసురుగా, వడిగా, వడివడిగా నడిచి వెళ్ళిపోయింది.

ఈలాగే ఉంటుంది ఆమె వ్యవహారం. అమ్మమ్మ సినీమాలలో చిత్రించే అత్తగారూ కాదు. అత్తయ్య పెద్దలని విధిగా ఎదిరించాలనే వ్రతం పట్టిన అమ్మాయీ కాదు. ఇద్దరూ ఎవరంతటవారు మంచివారే. కాని రెండుచేతులూ కలిస్తే చప్పట్లు! చిన్నప్పుడు నేను ఓ ఆయిల్ పెయింటరువద్ద గ్రీన్ పెయింట్ మింగేశాను. అది విషం అని చెప్పాడు ఆ పెయింటరు. చాలా బాధపెట్టింది కడుపులో. నేను కొంతసేపు ఏడుపుమొహంతో కూర్చున్నాక అతనన్నాడు. "ఊరికే అన్నానోయ్." నా బాధ ఇట్టే తగ్గిపోయింది మరుక్షణంలో! అత్తయ్య కూడా నేను బాధపడ్డట్టే బాధపడుతోందా?... అత్తయ్యకూ అమ్మమ్మకూ మధ్య పొత్తు లేక పోవడం చూసి ఎంతమందో చెప్పిచూసారు. అత్తగారంటే ప్రేమతో ఉండాలనీ ... ఇంకా ఏవేవో. అవి అత్తయ్యను మరింత బాధపెట్టేయి.

మామయ్య ఇవాళ నాతో భోజనానికి కూర్చున్నాడు; ఇది అపూర్వంపైగా చాలా తొందరగా ఐదునిమిషాల్లో భోజనం ముగించాడు. అమ్మమ్మ చాలా బాధపడింది. మావయ్య బట్టలు వేసుకుంటుంటే అడిగాను. "ఎందుకో నీకింత తొందర!" "దత్తాత్రేయులు లేడూ! అతనుకారు ఓ ముసలమ్మ మీదికితోలేడు. అతన్ని జైలులో పడకుండా..." అని అత్తయ్య అందించిన లెదర్ బాగ్ తీసుకొని దాదాపు పరుగెత్తాడు. దత్తాత్రేయులు మావయ్య తోటి ఉద్యోగి; పెద్దకుటుంబం. అతనికి శిక్షపడితే అతని పిల్లలూ, రోగిష్ఠిపెళ్ళాం, ముసలి తల్లిదండ్రులూ...అంతా బాగానే ఉంది, దత్తాత్రేయులకీ మావయ్యకీ ఉన్న పరిచయం మామూలుదైతే...

ఒకసారి మావయ్య కంపెనీకి పెద్దనష్టం వచ్చింది. దానికి కారణం దత్తాత్రేయుల తెలివితక్కువా, అజాగ్రత్తాను. దత్తాత్రేయులు ఏదో కల్పించి నేరం మావయ్యమీదికి తోసేశాడు. మావయ్య అతికష్టంమీద ఐదువందలు నష్టంతో ఉద్యోగం నిలబెట్టుకున్నాడు. మావయ్యంటే పెద్ద గౌరవం, నమ్మకం వున్న పై అధికారులు ఆశ్చర్యపోయారు. అట్టి దత్తాత్రేయులుని కోర్టు చేతుల్లోంచి రక్షించడానికి మావయ్య నడుం కట్టాడు! క్లాసులో అడుగెట్టిన నన్నుచూచి గొల్లుమన్నారు. లాజిగ్ క్లాసులోకి వెళ్ళాను లెక్కల క్లాసులోకి వెళ్ళబోయి!

ఇంటర్వల్ లో ఇంటికెళ్ళాను. అత్తయ్య తలగడలో తలదూర్చి ఘోరంగా ఏడుస్తోంది. మళ్ళీ ఏం జరిగిందో అత్తయ్యని మార్చడం బ్రహ్మతరం కాదు...

సాయంత్రం ఇంటికి వచ్చాను చెంబు తపేలాల హీనస్థితినిగూర్చి ఆలోచిస్తూ, కాని ఆశ్చర్య పడవలసివచ్చింది. అత్తయ్య కళ్ళు తిప్పుకుంటూ ఏవేవో కబుర్లు చెప్పేస్తోంది అమ్మమ్మ జడ వేస్తుంటేను! ఏమిటీ ఈ పరివర్తన! అత్తయ్య ఈ మధ్యాహ్నం ఏడుపులో కక్షకడిగేసిందేమిటి? నా కళ్ళద్దాలలోని ప్రశ్నార్థకాలను చూసి అమ్మ అంది ఆ దత్తాత్రేయులు ధర్మమా అని...మిగిలింది. నవ్వులో మునిగిపోయింది. ఎంతహాయి ఈరేయి నిండునో...

అత్తయ్య నాతో మాట్లాడటానికి సిగ్గుపడుతోంది. అవును. ఆమె ధరించిన అజ్ఞానపు పాత్రకి నేనే ఏకైక ప్రేక్షకుణ్ణి! "బాబి మీ అమ్మమ్మ ఎంతో మంచివారుకదూ?" అత్తయ్య అంటోంది. నేను నవ్వాపుకొని అవునన్నాను. అత్తయ్య నావేపు తిరిగి "మరి నాకు ఎందుకు చెప్పలేదూ?" అంది కోపం నటిస్తూ. నిజమే. అత్తయ్యకు "అత్తగారు" రాక్షసి అనే తెలుసును. సదభిప్రాయం లేకపోతే మంచికూడా చెడ్డలా కనపడుతుంది. అమ్మమ్మ తనను ఎలా ట్రీట్ చేసినా అత్తయ్య క్షమిద్దామనుకుందిట మావయ్యా దత్తాత్రేయులుకి చేసినట్లు. కాని అమ్మమ్మలో క్షమించడానికి ఏమీ కనపడలేదుట! ఇప్పుడు అమ్మమ్మ చేసిన ప్రతిపనీ మంచిదేనంటుంది అత్తయ్య. మావయ్య రాత్రి పదకొండు గంటలకి వచ్చాడు. దత్తాత్రేయులుని ఎంత శ్రమపడినా జైలునుంచి కాపాడలేకపోయాడుట మావయ్య. అత్తయ్యలో పరివర్తన మాత్రం నిలిచిపోయింది. ★